క్లుప్తంగా

14న కర్నూలులో ధర్నా



ఈఓఆర్డీకి వినతి పత్రం అందజేస్తున్న ఆరోగ్య కార్యదర్శులు

ఓర్వకల్లు: కర్నూలులో ఈ నెల 14వ తేదీన నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సచివాలయ ఆరోగ్య కార్యదర్శి జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరమ్మ, రాష్ట్ర ప్రధాన ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఈఓఆర్డీ సుబ్బరాయుడుకు వారు ఆరోగ్య కార్యదర్శులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

వివాదంగా మారిన విద్యుత్ వైర్ సమస్య



ఎస్సార్బీసీ కెనాల్ కింద వెళ్లిన విద్యుత్ వైర్

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో విద్యుత్ వైరు కనెక్షన్ వివాదంగా మారింది. ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం అక్కడికి చేరుకున్న అధికారులు విద్యుత్ కనెక్షన్‌ను పరిశీలించారు. అనుమతి లేకుండా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ కింద వైరు వెళ్లి కాల్వ అవతలి గడ్డిలో మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పాణ్యం ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ ప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామంలో పశుపోషణ ఎక్కువగా ఉండటంతో నిత్యం నీటి కోసం పశువులు ఎస్ఆర్బీసీ కాల్వ కింద వెళ్తుంటాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని గ్రామస్తులు అధికారులు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి



బాలమద్దిలేటి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని భూపనపాడు గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త బి. బాలమద్దిలేటి (75) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యానారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్ష్యులు రామలక్ష్మయ్య తదితరులు బాలమద్దిలేటి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ

ఓర్వకల్లు: రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ శనగ విత్తనాలను గురువారం హుసేనాపురం గ్రామంలో పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, భాస్కర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మెడికోకు ఆర్థిక సాయం

కర్నూలు(అర్బన్): పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం విద్యార్థి ఎం.ప్రవీణ్‌బాబుకు ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయం అందించింది. గురువారం సాయంత్రం స్థానిక బీ క్యాంప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు హరిదాస్ ఈరన్న మాట్లాడుతూ.. పే బ్యాక్ టు సొసైటీ పిలుపులో భాగంగా అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుతున్న ప్రవీణ్‌బాబుకు మెస్ చార్జెస్, హాస్టల్ ఫీజు, పుస్తకాలు, రికార్డులు తదితరాలకు సంబంధించి రూ.34,500 చెక్కును అందించామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక పాత బస్టాండ్ మున్సిపల్ పార్కులో సాధన చేస్తున్న తైక్వాండో క్రీడాకారులకు గురువారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంటూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉండాలంటే క్రీడల్లో రాణించాలన్నారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మామిడి సాగుకు ప్రోత్సాహం కరువు !

- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు
- కొత్తగా సాగుకు మొగ్గుచూపని వైనం
- పట్టించుకోని ఉద్యాన అధికారులు



మామిడి చివరి మొక్కలను కత్తిరిస్తున్న రైతు



కొమ్మలకు మందు రాస్తున్న మహిళా కూలీ

పాణ్యం: ఉద్యాన సాగు అధ్వానంగా మారుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం నుంచి కనీస ప్రోత్సాహం లేకపోవడంతో ఉద్యాన పంటల సాగు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. అధికారులు లక్ష్యాలు విధించడం తప్పా ప్రోత్సాహకాల విషయం చెప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మామిడి సాగు ప్రశ్నార్థకంగా మారింది. పాణ్యం మండలంలో దాదాపు 250ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. పాణ్యంతోపాటు సుగాలిమెట్ట, తమ్మరాజు పల్లె, కొడిదేడు గ్రామాల్లో అత్యధికంగా మామిడి సాగు అవుతుంది. అదేవిధంగా భూపనపాడు, గోరకల్లు, కొండజూటూరు తదితర గ్రామాల్లోనూ మామిడి సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో సాగు ఎలా సాగించేలనే ఆలోచనలో పడ్డారు మామిడి రైతులు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కేవలం 120హెక్టార్లలో మాత్రమే సాగు అయ్యేది. మహానేత ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తూ రాయితీలు అమలు చేశారు. దీంతో ఏటేటా మామిడి సాగు విస్తీర్ణం పెరిగింది. తండ్రి బాటలో తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం రైతన్నకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. కొత్తగా మామిడి సాగు చేసుకునే రైతులకు ఎకరానికి రూ. 13 వేలు అందించేవారు. అలాగే మూడేళ్లపాటు మామిడి మొక్కల నిర్వహణకు ఖర్చులు అందజేశారు. అనుకోని పరిస్థితుల మూలంగా పంట నష్టం జరిగితే ఆ ఏడాదే పరిహారం అందజేసింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా రైతులకు ఎలాంటి భారం లేకుండా పంటల బీమాను ప్రభుత్వమే భరించి రైతుకు భరోసా కల్పించాడు మాజీ సీఎం వైఎస్ జగన్.

రైతన్నను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు నెలల కూటమి పాలనలో కనీసం ముఖ్యమైన హామీలను కూడా అమలు చేయడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు రైతులు. పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని గుప్పించిన హామీని టీడీపీ పెద్దలు విస్మరించారని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కనీసం సూచనలిచ్చే అధికారులు కరువయ్యారని మామిడి రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మామిడి చెట్లకు ప్రూనింగ్ (కొమ్మలు కత్తిరించే) పనులు చేసుకుంటూ ఉద్యాన సాగును కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందంటూ విమర్శిస్తున్నారు.

మామిడి సాగుకు ప్రోత్సాహకాలు అందించాలి



ఉద్యానసాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. ఇప్పటికే సీజన్ ప్రారంభమైంది. రైతులకు ఎలాంటి రాయితీలు ఇస్తారు అనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతు భరోసా, పంటన ష్టం, ఉచిత బీమా చేయించారు. ప్రభుత్వం సహకారం అందించకుంటే మామిడి సాగు చాలా కష్టం. ప్రభుత్వం స్పందించి మామిడి రైతులకు ప్రోత్సాహకంగా రాయితీలు ప్రకటించి ఆదుకోవాలి.

–జాకీర్ మామిడి తోట యజమాని

పథకాలు వస్తే రైతులకు తెలియజేస్తాం

ప్రభుత్వం మామిడి సాగుకు సంబధించి ఎలాంటి పథకాలు అమలులో లేవు. వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తాం. ప్రస్తుతం ఎవరైనా కొత్తగా మామిడి సాగు చేపడితే ఉపాధి పథకం ద్వారా రాయితీ కల్పిస్తాం. వీటికి తప్పా ఇంకా ఎలాంటి పథకాలు అందుబాటులో లేవు.

–హరినాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్ఓ, పాణ్యం

14న మద్యం దుకాణాలకు 390 దరఖాస్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 14మద్యం దుకాణాలకు గురువారం సాయంత్రానికి 390దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల11వ తేదీ శుక్రవారం రాత్రి 7గంటల వరకు అవకాశం ఉందని సీఐ తెలిపారు.

అన్నదానం

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయము ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మాత విగ్రహం దగ్గర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగమదిలేటి, గంగాధర్ భక్తులకు అన్నదానం చేశారు. వాసవీ నగర్‌లో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

కల్లూరు: తిరుపతిలో గత వారంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను గురువారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రత్యేక అభినందించారు. అండర్-14, అండర్-17 పోటీలలో మెడల్స్ సాధించిన మాస్టర్ షబ్బీర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

నిర్ణయించిన ధరలకే ఆయిల్ పాకెట్లు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్: కిరాణా దుకాణదారులు అధిక రేట్లకు ఆయిల్ పాకెట్లను విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ హెచ్చరించారు. గురువారం కోడుమూరులోని కిరాణ అంగళ్ల నిర్వాహకులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల విపరీతంగా పెరుగుతున్నాయంటూ అధిక రేట్లకు ఆయిల్ పాకెట్లను విక్రయిస్తున్నారని, ఇది ఏ మాత్రం తగదన్నారు. ముఖ్యంగా పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ రేట్లను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. సన్‌ప్యూర్, సన్ జ్యోతి, సన్ ప్రీతి లీటర్ ఆయిల్ పాకెట్ రూ.126లు, గుడ్ లైఫ్ రూ.119, పామాయిల్ రాయల్ గోల్డ్ రూ.119, ప్రియ గోల్డ్ రూ.121, పామ్ గోల్డ్ రూ.119 చొప్పున విక్రయించాలని తహసీల్దార్ కిరాణా నిర్వాహకులకు సూచించారు.

14 నుంచి గ్రామ సభలు

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ×పల్లె పండుగ× పంచాయతీ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక నిధుల కింద గ్రామాలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహిస్తామన్నారు. 14వ తేదీన ఓర్వకల్లు, 15న కొమరోలు, వెంకటాపురం, సోమయాజులపల్లె, చెన్నంశెట్టిపల్లె, 16న పాలకొలను, చింతలపల్లె, కన్నమడకల, తిప్పాయపల్లె, 17న కాల్వ, బొడ్డువానిపల్లె, ఉప్పలపాడు, గుడుంబాయితండా, 18న మీదివేముల, ఎన్ కొంతలపాడు, ఉయ్యాలవాడ, 19న నన్నూరు, పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

14 నుంచి పల్లెపండుగ


కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. కర్నూలు మండలానికి ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, గ్రామాల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజలు చేస్తామన్నారు.



కంకర పరిచారు ... రోడ్డు మరిచారు!

కల్లూరు: నన్నూరు నుంచి బస్తిపాడు వరకు ఆర్ అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. 44వ జాతీయ రహదారి నుంచి తడకనపల్లె గ్రామానికి సుమారుగా 4 కి.మీ దూరం ఉంది. రోడ్డు విస్తరణ పనులు జరుగతున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేయాలో, రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు నెలలుగా రోడ్డుపై కంకర వదిలేశారని విచారం వ్యక్తం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డుపై కంకరను వేసి పనుల్లో జాప్యం జరుగుతుండడంతో నిత్యం తిరిగే భారీ వాహనాలు, ట్రాక్టర్ల వలన దుమ్ముతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ద్విచక్ర, ఆటో ప్రయాణికుల ఇబ్బంది చెప్పనలవి కాదు. రోడ్డుపై కంకరను వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాలు అదుపుతప్పి కిందపడి సందర్భాలు లేకపోలేదు. అధికారులు స్పందించి తారు రోడ్డు వేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


వైభవంగా శరన్నవరాత్రుల ఉత్సవాలు



కోడుమూరులో దుర్గాదేవిగా శ్రీమాతా అంబా భవానీ



దుర్గాదేవిగా కన్యకా పరమేశ్వరీ దేవి



నాగలాపురంలో దుర్గాదేవిగా శ్రీసుంకులా పరమేశ్వరీ



సి.బెళగల్ : దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో పార్వతీ అమ్మవారు



పాణ్యం: దుర్గా దేవిగా అమ్మవారు



దుర్గాదేవిగా కాన్యకాపరమేశ్వరి



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవానీ, శ్రీఅంబా భవానీ, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా చండీ హోమం నిర్వహించారు. శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం గూడూరు మండలంలో అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గూడూరులోని శ్రీమాతా అంబ భవానీ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కె.నాగలాపురం గ్రామంలో వెలసిన శ్రీసుంకులపరమేశ్వరీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సి.బెళగల్: మండలంలో దసరా ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సి.బెళగల్ కొత్త బస్టాండ్ ఆవరణంలోని ఈశ్వరాలయం, పాత బస్టాండ్‌లోని శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి దేవి ఆలయంలో కొలువైన అమ్మవార్లు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పూజారు సుదర్శణమాచార్యులు, నరహరి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాణ్యం: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాణ్యం దేవాదాయశాఖ, హైందవ శక్తి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో ఆకట్టుకున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రతన్ టాటాకు నివాళి

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం వీఆర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు. కర్నూలు యూనిట్ సభ్యులు రతన్ టాటా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన రతన్ టాటా అందరికీ స్ఫూర్తిదాయకమని సంస్థ కన్వీనర్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఇలాంటి మేధావులను దేశం ఎప్పటికి మరిచిపోదని వారి సేవలను స్మరించుకుంటుందన్నారు. సభ్యులు హనుమంత రెడ్డి, శివారెడ్డి, చంద్రారెడ్డి, మురళీధర్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, ప్రభాకర్, యుగంధర్, ఎరుకల హరి, సురేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): తిరుపతి పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. క్రీడాకారులు విశాల్, నవీన్, వెంకట శివరాం, కార్తీక్ వెండి పతకాలు, అఖిల్, మోహన్‌కుమార్, శ్యాం సుందర్ కాంస్య పతకాలు సాధించారు. నిర్వాహకులు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో మాస్టర్ సతీష్‌కుమార్ అభినందించారు. స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు, ఏపీఎస్‌పీ క్యాంపు, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

రైతుబజార్లలో తనిఖీలు



అమీన్ అబ్బాస్ నగర్ రైతు బజారులో తనిఖీ చేస్తున్న ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ టీమ్ తనిఖీ చేసింది. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణ మూర్తి ఆధ్వర్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్నలతో కూడిన బృందం సీ.క్యాంపు, కొత్తపేట, అమీన్ అబ్బాసనగర్ రైతుబజార్లలో తనిఖీలు జరిపింది. కూరగాయల ధరలు ఏ విధంగా ఉంటున్నాయి.. టమాట, ఉల్లిగడ్డలను ఏ ధరతో అమ్మకాలు సాగిస్తున్నారని పరిశీలించారు. టమాట కిలో రూ.42, ఉల్లిగడ్డలు రూ.36కు మించి అమ్మరాదని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి ఆదేశాలు ఇచ్చారు. రైతుబజార్లలో ఏర్పాటు చేసిన వంట నూనెల ప్యాకెట్ల పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. నిర్ణయించిన ధరలకే అమ్ముతున్నారా? లేదా? అని ఆరా తీశారు.

13న దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను ఈ నెల 13వ తేదీన నిమజ్జనం చేయనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ వెల్లడించారు. ఆయన గురువారం నిమజ్జన ప్రాంతమైన తుంగభద్రా నది ఘాట్‌ను సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ ఏడాది నగరంలో సుమారు వంద విగ్రహాలు ప్రతిష్ఠించారని, 13న ప్రధాన కూడళ్ల మీదుగా సంకల్ బాగ్‌కు శోభాయాత్రగా విగ్రహాలు నిమజ్జనానికి తరలి రానున్నట్లు చెప్పారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లతో నిమజ్జనం జరుగుతుందన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. నదిలో ప్రవాహం ఉధృతంగా ఉందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

కర్నూలు(సెంట్రల్): మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన యతినర్సింగానంద్‌పై చర్యలు తీసుకోవాని ముస్లిం మత పెద్దలు ముఫ్తి సయ్యద్ మన్సూర్అహ్మద్, సయ్యద్ షఫీ పాషాఖాద్రి, సయ్యద్ జాకీర్ అహ్మద్ రషాది, అబ్దుల్ రెహమాన్, సయ్యద్ మహ్మద్ పీర్, షేక్ జహంగీర్ తదితరులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. ఈ మేరకు గురువారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మహ్మద్ ప్రవక్తపై విద్వేష పూరిత ప్రసంగం చేసిన యతినర్సింగానంద్‌పై కేసు నమోదు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రోడ్డెక్కిన రైతులు

- అమరావతి హైవే దిగ్బంధం
- స్తంభించిన రాకపోకలు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వ్యవహారం



హైవేపై బైఠాయించిన నూతన పల్లె రైతులు



అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

కర్నూలు రూరల్ : పంట పొలాలకు రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నూతన పల్లె గ్రామ రైతులు గురువారం రోడ్కెక్కారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణా, మండల గౌరవ అధ్యకుడు, ఈ తాండ్రపాడు సర్పంచ్ బాల పీర ఆధ్వర్యంలో అమరావతి జాతీయ రహదారిపై బైఠాయించారు. జాతీయ రహదారికి పంట పొలాలు త్యాగం చేసిన తమ పొలాలకు రహదారిని ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గంటన్నరకుపైగా దిగ్బంధించడంతో రాకపోకలు స్తంభించాయి. అధికారులకు వ్యతిరేకంగా రైతులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పోలీసులు, హైవే అధికారులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పినా రైతులు ససేమిరా అన్నారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధన కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అమరావతి జాతీయ రహదారి నిర్మాణానికి విలువైన భూములను తక్కువ ధరకు త్యాగం చేసిన రైతుల పొలాలకు దారి కల్పించకపోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. నూతనపల్లె గ్రామ భూములు బహిరంగా మార్కెట్‌లో ఎకరా రూ.60.70 లక్షలు లక్షలు ఉందని, కేవలం రూ. 11 లక్షలు పరిహారికి రైతులు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజాప్రయోజనం కోసం విలువైన భూములను తక్కువ ధరకే త్యాగం చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకపోవడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు.

సమస్య పరిష్కరించకుంటే టోల్‌గేట్ వద్ద హైవేను దిగ్బంధిస్తాం

నూతన పల్లె గ్రామ రైతుల పొలాలకు ఈ నెల 12వ తేదీలోపు రస్తా ఏర్పాటు చేస్తామని హైవే అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయకుంటే నన్నూరు టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. సమస్యను పరిష్కరించాలని రెండువారాలుగా ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశామని, స్పందన లేనందునే రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో మరోమారు రైతులతో కలిసి రోడ్డెక్కాల్సి వస్తుందని హెచ్చరించారు.